ప్రజాశక్తి

ఆదివారం 12 మే 2024


8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



అటెన్షన్..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమీపించడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలతో ప్రచార గడువు ముగియడంతో అంతటా నిశ్శబ్దం అలుముకుంది. ఓట్లు రాబట్టుకొనే క్రమంలో డబ్బు పంపిణీ మొదలైంది. ఎన్నికల నిఘా వ్యవస్థల కళ్లకు కనబడకుండా, ఓటరుకు డబ్బులు చేరేలా అభ్యర్థులు చాలా అటెన్షన్‌గా వున్నారు.

సోమవారం పోలింగ్ జరగనుండడంతో ఆదివారం రాత్రి నాటికి డబ్బు, మద్యం పంపిణీ పని పూర్తిచేసేలా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ నమ్మకస్తులను గ్రామాల వారీగా పంపించి, డబ్బులు అందజేసే ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, చోడవరం, వి.మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాలతో పాటు పెందుర్తి నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ మండలాలున్నాయి. వీటిలో పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల నుంచి కూటమి తరపున జనసేన అభ్యర్థులు, పాయకరావుపేట, వి.మాడుగుల, నర్సీపట్నం, చోడవరం నుంచి టిడిపి అభ్యర్థులు పోటీలో వున్నారు.

అనకాపల్లి లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా బిజెపి నుంచి కడపకు చెందిన సిఎం రమేష్ పోటీచేస్తున్నారు. వైసిపి ఎంపీ అభ్యర్థిగా రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు బరిలో వున్నారు. బిజెపికి ఈ లోక్‌సభలో బలం లేకపోవడంతో ఆకట్టుకోవడానికి మిగతా 2లో..

- అభ్యర్థుల ప్రచారానికి తెర
- డబ్బుల పంపిణీపై ప్రధాన పార్టీల కేంద్రీకరణ
- ఎన్నికల యంత్రాంగం కంటపడకుండా జాగ్రత్తలు
- కూటమికి తోడ్పడేలాలేని ప్రధాని, కేంద్ర మంత్రుల ప్రచారం
- బిజెపిపై వ్యతిరేకత తమపై పడుతుందన్న ఆందోళనలో టిడిపి, జనసేన



ఎన్నికల ప్రచార కార్యక్రమంలో జగ్గునాయుడు తదితరులు

జోరుగా జగ్గునాయుడు ప్రచారం

గాజువాకలో వాడవాడలా ఆదరణ

వార్త సెంటర్ స్ప్రెడ్‌లో..

మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు సికింద్రాబాద్ – విశాఖపట్నం – సికింద్రాబాద్, కెఎస్ఆర్ బెంగళూరు – రూర్కెలా – ఎస్ఎంవిటి బెంగళూరు, ఎస్ఎంవిటి బెంగళూరు –ఖరగ్‌పూర్ – ఎస్ఎంవిటి బెంగళూరు, ఎస్ఎంవిటి బెంగళూరు – ఖుర్దా రోడ్ – ఎస్ఎంవిటి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు 07097 సికింద్రాబాద్ – విశాఖపట్నం వేసవి ప్రత్యేక రైలు మే 12 ఆదివారం మిగతా 2లో..

మద్యం అమ్మకాలు బంద్

వార్త 3లో..

పాలకుల భవితవ్యాన్ని నిర్ణయించేలా తీర్పు ఉండాలి

వార్త 8లో..

సొంతూరుకు జనం పయనం

వార్త 2లో..

విపత్కర పరిస్థితుల్లో 'విశాఖ ఉక్కు'

నేటికీ ఉద్యోగులకు అందని నెల జీతం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కును విపత్కర పరిస్థితుల్లోకి కేంద్రంలోని బిజెపి, స్టీల్ యాజమాన్యం నెట్టేశాయి. ఉత్పత్తి జరగకుండా ఇప్పటికే 3 బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో 2 మూసేశారు. 6 రోలింగు మిల్లులుంటే ఒకదాన్ని ఆన్ అండ్ ఆఫ్ రన్ చేస్తూ మిగతా అన్నిటినీ దాదాపు నడవకుండా నిలిపేశారు. ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌పై కేవలం 4500 టన్నుల స్టీలే ప్రస్తుతం వస్తోంది. రోజుకు సుమారు 20 వేల టన్నులు ఉత్పత్తి కావాల్సిన ఉక్కు కర్మాగారంలో ఇంత పతన స్థాయిలో ఉత్పత్తి రావడం, సంక్షోభంలో చిక్కుకోవడం గడచిన 40 ఏళ్లలో ఇదే తొలిసారి అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో – కన్వీనర్ జె.అయోధ్యరామ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో 5 లక్షల టన్నుల స్టీల్ డిమాండ్ ఉండగా ప్రస్తుతం 70 వేల టన్నులే ఉత్పత్తి అవ్వడం ఉక్కు సంక్షోభానికి తార్కాణంగా నిలిచిందన్నారు. 11వ తేదీ వచ్చేసినా ప్లాంట్‌లో జీతాలివ్వని పరిస్థితి నెలకొందని, అయినా కార్మికులు ఉత్పత్తిలో పాల్గొంటూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు మిగతా 2లో..



స్టీల్‌ప్లాంట్ (ఫైల్‌ఫొటో)

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

- 20 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు
- ఎన్నికల నిర్వహణకు 13,069 మంది అధికారులు, సిబ్బంది కేటాయింపు
- మీడియాతో విశాఖ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 13న జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఆ దిశగా పటిష్ట ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. 20,12,373 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా మహిళలకు, పురుషులకు, వృద్ధులకు, వికలాంగులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశామని అన్నారు. పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు నుంచి సైలెంట్ పిరియడ్ అమలవుతుందని, 144 అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల గురించి శనివారం స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో పోలీస్ కమిషనర్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. జిల్లాలో 1991 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటి వద్ద 11 రకాల కనీస వసతులు కల్పించామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్ విధించనున్నట్టు చెప్పారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా 13,069 మిగతా 2లో..



మాట్లాడుతున్న మల్లికార్జున, చిత్రంలో సిపి రవిశంకర్

మొదటి పేజీ తరువాయి..

అ'టెన్షన్'

రమేష్ పడరానిపాట్లు పడ్డారు. తన బలాన్ని ప్రదర్శించుకునేందుకు అనవసర వివాదాలకు వెళ్లి జిల్లాలో అతి తక్కువ రోజుల్లో పరువు పోగుట్టుకున్నారు. బిజెపి జాతీయ నాయకత్వంతోవున్న పరిచయాల ప్రచార ప్రదర్శనా ఆయనకు తోడ్పడేలాలేదు. కూటమి తరపున ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా ప్రచారానికి వచ్చినప్పటికీ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపివేత, సొంత గనులు కేటాయింపుపై వారెవరూ హామీ ఇవ్వకపోవడంతో వారిరాక కూటమి అభ్యర్థులకు మరింత నష్టం వాటిల్లేలావుంది. బిజెపితో కలయిక ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ల ఓట్లకు నష్టం చేకూరుస్తుందన్న ఆందోళన టిడిపి, జనసేన అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ఇవ్వాల్సిన నిధులు నిలిపివేయడం, విశాఖ రైల్వేజోన్‌పై పూటకోమాట మాట్లాడ్డం, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం, పునరావాస నిధులు సహా ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు సరిపడా విడుదలచేయకపోవడం వంటి పలు కారణాలతో వివిధ తరగతుల్లో తీవ్ర అసంతృప్తివుంది. ఆ వ్యతిరేకత తమపై పడుతుందని టిడిపి, జనసేన అభ్యర్థుల్లో ఆందోళన కనబడుతోంది.

వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు తోడు, కూటమి కలయికతో కొన్ని తరగతుల్లో పెరిగిన వ్యతిరేకత తమకు అనుకూలంగా మారుతుందన్న ధీమాలో ఉన్నారు. అభ్యర్థుల తరపున జగన్ ప్రచారం చేశారు. ఆయన సభలకు వచ్చిన జనం, చంద్రబాబు సభలకు వచ్చిన జనాన్ని భేరీజు వేసుకొని తమకు ప్రజల మద్దతు వుందన్న విశ్వాసం వైసిపి అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. ఇండియా వేదిక తరపున పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులకు వామపక్షాల మద్దతు వారికి బలాన్ని ఇచ్చినట్లయింది. కాంగ్రెస్ పార్టీ అభిమానులు సహా బిజెపి, టిడిపి, జనసేన, వైసిపి వ్యతిరేక ఓటు ఇండియా వేదిక ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు తోడ్పడుతుందని వారు భావిస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

మంది అధికారులను, సిబ్బందిని కేటాయించామని వివరించారు. అందులో 2,183 మంది పీవోలు, 2,192 మంది ఏపీవోలు, 8,694 మంది ఓపీవోలు ఉన్నారని తెలిపారు. అలాగే ఒక పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 22 మంది ఏఆర్వోలు, 21 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. జిల్లాలో 152 సెక్టార్లు, 207 రూట్లు ఉన్నాయని, 847 కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 94.36 శాతం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశామని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 20,998 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేసేందుకు అనువుగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏడు, రిసెప్షన్ కేంద్రాలు ఏడు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అన్ని నియోజకవర్గాలకు కలిపి 9,627 బ్యాలెట్ యూనిట్లను, 4,681 కంట్రోల్ యూనిట్లను, 5,040 వీవీ ప్యాట్లను అందజేశామని పేర్కొన్నారు. 1,457 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. 11 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళల చేత నిర్వహించేవి ఏడు, యువత ఆధ్వర్యంలో నిర్వహించేవి రెండు, వికలాంగుల ఆధ్వర్యంలో సాగేవి రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం వెయ్యి వీల్ ఛైర్లు సమకూర్చామన్నారు. ఈ నెల 13వ తేదీని ఆర్జిత సెలవుగా ప్రకటించామని, ఈ మేరకు కార్మిక శాఖకు ఉత్తర్వులు జారీ చేశామని పేర్కొన్నారు. మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. పర్యవేక్షణ నిమిత్తం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక డిప్యూటీ కలెక్టర్, సీనియర్ అధికారుల పర్యవేక్షణలో 24 గంటలూ కంట్రోల్ రూమ్ సేవలు అందుతాయన్నారు. ప్రజలు 0891 - 2590100 ఫోన్ నంబర్ లేదా టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా సంప్రదించవచ్చని సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు : సిపి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీసు విభాగం తరపున పటిష్ట ఏర్పాట్లు చేశామని పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సుమారు మూడు వేల మందిని నియమించామని చెప్పారు. 10 సిఆర్‌పిఎఫ్ క్యాంపులు, ఒక ఎపిఎస్‌పి క్యాంపు అందుబాటులో ఉంటాయన్నారు. వీరితో పాటు ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్, విశ్రాంత ఆర్మీ, విశ్రాంత పోలీసు అధికారులు 962 మందిని సేవకులుగా వినియోగిస్తున్నామని చెప్పారు. 476 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో 'విశాఖ ఉక్కు'

చేస్తున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ భూములు వేల ఎకరాలు రాష్ట్రపతి పేరు మీద ఉన్నాయని, వాటిని ఆర్‌ఐఎన్‌ఎల్ పేరు మీదకు మార్చాలని, అప్పుడు కంపెనీ నెట్‌వర్క్ మైనస్ రూ.1700 కోట్ల నుంచి రూ.70 వేల కోట్ల ప్లస్‌లోకి వెళుతుందని తెలిపారు. ఇదే జరిగితే ప్లాంట్‌కు రుణాలివ్వడానికి బ్యాంకులన్నీ క్యూ కడతాయన్నారు. ప్లాంట్‌లో మెగా వెంచర్‌కు తెరతీయాలని, సెయిల్ ఆర్‌ఐఎన్‌ఎల్, ఎన్‌ఎండిసి కలిపి మెగా వెంచర్ చేస్తే స్టీల్ ఇండస్ట్రీకి మంచి రోజులు వస్తాయని, ఉత్పత్తి పెరగనుందని తెలిపారు.

భారీ వాహనాల రాకపోకలు నిషేధం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల సంబంధించిన వాహనాలకు అడ్డంకులు లేకుండా మారేడుమిల్లి- చింతూరు మధ్య ఘాట్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలకు మూడు రోజులపాటు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని రంపచోడవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారుల వాహనాలకు మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఈనెల 12 నుండి 14వ తేదీ ఉదయం వరకు భారీ వాహనాలను ఘాట్ రోడ్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

(మొదటి పేజీ తరువాయి..) రాత్రి 19.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06:30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. 07098 విశాఖపట్నం - సికింద్రాబాద్ వేసవి ప్రత్యేక రైలు 13న సోమవారం రాత్రి 19.50 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేటి మరుసటి రోజు ఉదయం 8:15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లె, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ మీదుగా ప్రయాణిస్తాయి

06249 కెఎస్ఆర్ బెంగళూరు- రూర్కెలా వేసవి ప్రత్యేక రైలు మే 17 శుక్రవారం రాత్రి 21.15 గంటలకు కెఎస్ఆర్ బెంగళూరు నుంచి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 16.08 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 16.10 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 05.00 గంటలకు రూర్కెలా చేరుకుంటుంది. 06250 రూర్కెలా - ఎస్ఎంవిటి బెంగళూరు వేసవి ప్రత్యేక రైలు మే 19 ఆదివారం ఉదయం 07.00 గంటలకు రూర్కెలా నుండి బయలుదేరి అదేరోజు రాత్రి 19.18 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 19.20 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు సోమవారం మధ్యాహ్నం 14:00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు కృష్ణరాజపురం, బంగారుపేట, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, రాయగడ, తిట్లాగఢ్, బర్దస్‌పూర్, బర్దాస్ రోడ్, బలాంఘర్, బలంగ్‌హర్ రోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

06259 ఎస్ఎంవిటి బెంగళూరు - ఖరగ్‌పూర్ వేసవి ప్రత్యేక రైలు మే 25 శనివారం ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుండి బయలుదేరి మరుసటి రోజు ఆదివారం ఉదయం 05.28 గంటలకు దువ్వాడకు చేరుకొని మరలా 05.30 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 19.30 గంటలకు ఖరగ్‌పూర్ చేరుకుంటుంది. 06260 ఖరగ్‌పూర్ - ఎస్ఎంవిటి బెంగళూరు వేసవి ప్రత్యేక రైలు మే 26 ఆదివారం రాత్రి 22.15 గంటలకు ఖరగ్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.00 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 11.02 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మంగళవారం ఉదయం 8.00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు వైట్‌ఫీల్డ్, జోలార్‌పేట్, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనగిరి, కటక్, భద్రక్, బాలసూరు మీదుగా ప్రయాణిస్తాయి.

06251 ఎస్ఎంవిటి బెంగళూరు - ఖుర్దా రోడ్ వేసవి ప్రత్యేక రైలు మే 18 శనివారం ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 05.28 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 05.30 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 21.00 గంటలకు ఖుర్దా రోడ్డుకు చేరుకుంటుంది. 06252 ఖుర్దా రోడ్ - ఎస్ఎంవిటి బెంగళూరు వేసవి ప్రత్యేక రైలు మే 19 ఆదివారం రాత్రి 22.30 గంటలకు ఖుర్దా రోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.13 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 15.15 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 10:55 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు వైట్‌ఫీల్డ్, జోలార్‌పేట్, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగంగగూడ, సంబల్పూర్, రైరాఖోల్, అనుగుల్, ధెంకనల్, కటక్, భువనేశ్వర్ మీదుగా ప్రయాణిస్తాయి.

విశాఖ దక్షిణంలో అభివృద్ధి ఏదీ ?

కాంగ్రెస్ విశాఖ దక్షిణ అభ్యర్థి సంతోష్ కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పదేళ్ల గణేష్ కుమార్ హయాంలో దక్షిణ నియోజకవర్గం ఎటువంటి అభివద్ధికి నోచుకోలేదని కాంగ్రెస్ విశాఖ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి సంతోష్ కుమార్ విమర్శించారు. శనివారం కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసి గణేష్ కుమార్‌ను ఇంటికి పంపాలని ఓటర్లను కోరారు. కులమతాలకు, వర్గ రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసం, దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి హస్తం గుర్తుపై ఓటు వేసి విజయం చేకూర్చాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హయాంలో దక్షిణ నియోజకవర్గం అభివృద్ధి కుంటుపడిందన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన కులాలకు ప్రభుత్వ ఫలాలు అందలేదన్నారు. మత్స్యకారులు, ముస్లింలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాసుపల్లి గణేష్ కుమార్ హయాంలో ఫిషింగ్ హార్బర్ ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి మాట్లాడుతూ మతతత్వ బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేన కూటమిని, అధికార వైసిపిని ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులకు పట్టంకట్టాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ విశాఖ జిల్లా అధ్యక్షులు వజ్జిపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బాబువి ఉత్తుత్తి హామీలే..!

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కదాన్నీ అమలు చేయలేదని వైసిపి లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు చంద్రబాబు అనే మోసానికి, జగన్మోహన్ రెడ్డి అనే నమ్మకానికి మధ్య జరుగుతున్నాయని తెలిపారు. చంద్రబాబు కేవలం ప్రచారం కోసమే డబ్బు ఖర్చు చేసే మనిషి అని తెలిపారు. దానికి ఉదాహరణగా విశాఖపట్నంలో ఆయన వివిధ పారిశ్రామిక వేత్తలతో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులను పేర్కొన వచ్చున్నారు. ప్రచార ఆర్భాటం తప్ప రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చింది లేదన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు వైసిపి ప్రభుత్వంలోనే అందుతున్నాయని తెలిపారు.

సొంతూరుకు జనం పయనం



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

13న జరిగే ఎన్నికలకు వెళ్లే వారి సంఖ్య ఆదివారం మరింత పెరగ నుంది. పలువురు తమ సొంత కార్లు, ద్విచక్ర వాహనాలపై ఇప్పటికే సొంతూర్లుకు చేరుకున్నారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల వేళ ఓటు వేసేందుకు సొంతూరుకు ఓటర్లు కదులుతున్నారు. తమ అభిమాన నేతలను గెలిపించుకునేందుకు వారంతా శనివారం ఉదయం నుంచే బయలుదేరడంతో విశాఖలోని ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ రద్దీగా కనిపించాయి. బస్సులు, రైళ్లు కిటకిటలాడాయి.



బస్‌కాంప్లెక్స్‌లో ఓటర్ల తాకిడి

ముమ్మరంగా పోలింగ్ ఏర్పాట్లు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : నియోజకవర్గంలో పోలింగ్ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల13వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగనుంది. 348 పోలింగ్ కేంద్రాల్లో పిఒలు, ఎపిఒలు తదితరులు సుమారు 2,565 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. 800 ఓటర్లు పైబడిన పోలింగ్ కేంద్రాలకు ఆరుగురు, 800 పోలింగ్ కేంద్రాలలోపు ఉన్న వాటికి ఐదుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. 1200 ఓట్లు దాటిన 220 పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ విధానం అమలు చేయనున్నారు. 86 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు.

ఓటర్లు 3,63,013

జిల్లాలోనే అత్యధిక మంది ఓటర్లు ఉన్న నియోజక వర్గం భీమిలిలో 3 లక్షలా 63 వేలా 13 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 1,84,908 మంది, పురుషులు 1,78,090 మంది, ఇతరులు 15 మంది ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్లు..

పద్మనాభం మండలంలో మొత్తం ఓటర్లు 42,145 మంది ఉండగా ఇందులో మహిళలు 21,521 మంది, పురుషులు 20,624 మంది ఉన్నారు. ఆనందపురం మండలంలో మొత్తం ఓటర్లు 51,354 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 25,993 మంది, పురుషులు 25,361 మంది ఉన్నారు. భీమిలి మండలంలో మొత్తం ఓటర్లు లక్షా 24 వేలా 20 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 52,518 మంది, పురుషులు 49,899 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. విశాఖ రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు లక్షా 67 వేలా 94 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 84,876 మంది, పురుషులు 82,206 మంది, ఇతరులు 12 మంది ఉన్నారు

మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలు..

పద్మనాభం మండలంలో 1 నుంచి 45 పోలింగ్ కేంద్రాలు, ఆనందపురం మండలంలో 46 నుంచి 102 పోలింగ్ కేంద్రాలు, భీమిలి మండలంలో 103 నుంచి 207 పోలింగ్ కేంద్రాలు, విశాఖ రూరల్ మండలంలో 208 నుంచి 348 వరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

భీమిలి బరిలో 15 మంది

శాసనసభ నియోజకవర్గ ఎన్నికల్లో భీమిలి బరిలో 15 మంది ఉన్నారు. ఇందులో టిడిపి నుంచి గంటా శ్రీనివాసరావు, వైసిపి నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కాంగ్రెస్ అభ్యర్థి అడ్డాల వెంకట వర్మరాజు, చోడిపల్లి రాజు (ఎస్‌పి), భాగం గోపాలరావు (బిఎస్‌పి), కోలా హరిబాబు (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), ఇల్లిపిల్లి అనిల్ కుమార్ (జై భారత్ నేషనల్ పార్టీ), గంటా శ్రీనివాసరావు (జాతీయ జనసేన పార్టీ), ఇండిపెండెంట్లుగా నూకల సూర్య ప్రకాష్, మేకా సత్యకిరణ్, చొప్పల్లి శరవన్ గణేష్, బావిశెట్టి రమణ బాబు, బుగత రాము, నాగోతు నాగమణి, నందికోళ్ల సంధ్య పోటీలో ఉన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఆనందపురం: సార్వత్రిక ఎన్నికలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు మండల ఎన్నికల అధికారి హేమంత్ కుమార్ తెలిపారు. మండలంలో 57 పోలింగ్ కేంద్రాలలో 50,582 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద టెంట్లు ఏర్పాటుచేస్తున్నామని, మంచినీటి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి హేమంత్ కుమార్

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిఐ టివి.తిరుపతిరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శనివారం సాయంత్రం 6గంటలకు ఎన్నికల ప్రచారం ముగిసిందని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితులలోనూ ప్రచారం చేయకూడదని చెప్పారు. 13వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఇతర అడ్డంకులు కల్పించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని పోలింగ్ బూత్‌లు, పరిసర ప్రాంతాలలో సిసి కెమెరాలు, బాడీవార్న్ కెమెరాలు వినియోగించి ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయపార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని పెదనాగమయ్య పాలెం పంచాయతీ, చినగాగమయ్య పాలెం గ్రామానికి చెందిన చల్లపల్లి నరసింగరావు (28) ఈ నెల 10వ తేదీ నుంచి కనబడుట లేదని భార్య పారు భీమిలి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. టెన్త్ చదివిన నరసింగరావు చిప్పాడ దివీస్‌లో కార్మికునిగా పని చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 7గంటలకు మోటారు సైకిల్‌పై డ్యూటీకి వెళ్లి సాయంత్రం 6గంటలకు ఇంటికి చేరుకుంటారు. ఈ నెల 10వ తేదీన ఇంటి వద్దనే బైక్, సెల్ ఫోన్ విడిచి వెళ్లాడు. ఎటువంటి దుర్వసనాలూ లేని అతను ఎక్కడకు వెళ్లిందీ తెలియరాలేదు. బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేదు. భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నరసింగరావు 6అడుగుల ఎత్తు ఉంటాడు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



పూర్తయిన పెదగదిలి వంతెన రహదారి

అందుబాటులోకి పెదగదిలి బ్రిడ్జి రహదారి

హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ రోడ్డు ఆరిలోవ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో చేపట్టిన వంతెన ఎత్తు, విస్తరణ పనులు పూర్తయ్యాయి. సుమారు మూడు నెలల్లోనే అందుబాటులోకి రావడంతో ఆరిలోవ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరాయి. దీంతో ఆరిలోవ పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదు లైన్ల బిఆర్‌టిఎస్‌లో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా తోటగరువు వరకు వెడల్పయిన రోడ్డు ఉంది. ఈ రెండింటి మధ్య ఒక ప్రధాన గెడ్డపై ఇరుకైన 30 అడుగుల లోతుగా ఉండే వంతెన ఉండేది. బ్రిడ్జి లోతుగానూ, ఇరుకుగా ఉండడంతో వర్షాకాలంలో గెడ్డ పొంగడం, నీరు నిల్వ ఉండిపోయేది. ఈ సమస్య కొన్ని దశాబ్దాలుగా ఉండడంతో స్థానికులు చాలా ఇబ్బందులు పడేవారు. ఇటీవల మేయర్ గొలగాని హరి వెంకట కుమారి చొరవ తీసుకొని సుమారు రూ.4 కోట్లు నిధులు మంజూరు చేశారు. కేవలం మూడు నెలల వ్యవధిలో సుమారు 80 అడుగుల విస్తీర్ణంలో వంతెన రహదారి పనులు పూర్తి చేశారు. తోటగరువు నుంచి ఆరిలోవ అంబేద్కర్ విగ్రహం వరకు రెండు వరుసల రహదారి విస్తరణ పనులు కూడా కొనసాగుతున్నాయి. ఇదీ పూర్తయితే ఆరిలోవ ప్రజలకు చాలా వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తీరుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి కార్యకర్తలతో గంటా ములాఖత్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఉన్న టిడిపి కార్యకర్తలను భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు శనివారం ములాఖత్‌లో కలిశారు. భీమిలి నియోజకవర్గంలో ఇటీవలటిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య కొట్లాట జరిగింది. ఇరు గ్రూపుల వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. కేంద్రకారాగారంలో ఉన్న టిడిపి కార్యకర్తలను ములాఖత్ ద్వారా గంటా శ్రీనివాసరావు కలిశారు. సాయంత్రం బెయిల్‌పై టిడిపి కార్యకర్తలు విడుదలయ్యారు.

'వైసిపికి గీత కులస్తుల మద్దతు'

ప్రజాశక్తి -గాజువాక : ఈ ఎన్నికల్లో గీత కులస్తులు వైసిపి మద్దతు ఇస్తున్నట్లు ఉత్తరాంధ్ర గీత సహాయకులాల యువజన సంఘం అధ్యక్షులు ఏకుల వెంకటేష్ గౌడ తెలిపారు. గాజువాకలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది తమ సామాజిక వర్గం వారు ఉన్నారని తెలిపారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక గీత కులస్తుల్లో ఒకరిని రాజ్యసభకు, ఇద్దరిని రాష్ట్ర మంత్రివర్గ లోకి, ఇద్దరిని శాసనమండలికి, మరో ఇద్దరిని జిల్లా పరిషత్ చైర్మన్లుగా, ఐదుగురిని కార్పొరేషన్ చైర్మన్లను, 60 మంది డైరెక్టర్లను నియమించినట్లు తెలిపారు. తెలుగుదేశం హయాంలో ఎలాంటి గౌరవం దక్కలేదన్నారు. గాజువాకలో తెలుగుదేశం కూటమికి ఓటమి తప్పదన్నారు. నియోజకవర్గంలోని గీత కులస్తులు అందరూ ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌కు, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మద్యం అమ్మకాలు బంద్

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో ఉన్న 29 ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా అమ్మకాలు శనివారం రాత్రి 7గంటల నుంచి నిలిచిపోయాయి. 13వ తేదీ రాత్రి 7 గంటల వరకు మద్యం అమ్మకాలు నిలిపివేయనున్నారు.

దుకాణాల వద్ద బారులు

ఆనందపురం : ఎన్నికల నేపథ్యంలో శనివారం రాత్రి 7 గంటల నుంచి మద్యం దుకాణాలు మూసివేయడంతో శనివారం ఉదయం నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద మందుబాబులు బారులు తీరారు. రోజూ మద్యం సేవించే వారి కంటే, నల్ల బజారుకు తరలించే వారే ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది.

'ఉత్తరం'లో వైసిపి బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కెకె.రాజు, బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆధ్వర్యాన భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బాలయ్య శాస్త్రి లే-అవుట్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ నియోజకవర్గం మొత్తం సాగింది. ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్సా ఝాన్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు మాట్లాడుతూ, అనేక సంక్షేమ పథకాల ప్రవేశపెట్టి ప్రజల ముంగిటికే అందించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. బొత్స ఝాన్సీ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో విశాఖను పరిపాలన రాజధాని చేయుటకు ముఖ్యమంత్రి నిర్ణయించారని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సనపల చంద్రమౌళి, చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జివిఎంసి 55వ వార్డు పరిధి గాంధీనగర్ కాలనీలో కార్పొరేటర్ శశికళతో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు గడపగడపకూ వెళ్లి ప్రచారం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో గత ఐదేళ్లగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఏకలవ్య కాలనీలో ఇంటింటికీ కెకె.రాజు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ధర్మానికి, అధర్మానికి యుద్ధం : కెకె.రాజు

రానున్న ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధమని కెకె.రాజు అన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణు కుమార్‌రాజు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి నాయకులకు ఓటమి భయం వెంటాడుతుందని, అందుకే అనైతిక దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు.

నక్కవానిపాలెంలో లక్ష్మీనారాయణ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం జై భారత్ నేషనల్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ శనివారం నక్కవానిపాలెం ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ముందుగా నక్కవానిపాలెంలోని ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనేకమంది పేదవర్గాలను కలిసి మాట్లాడారు. మీ జీవితాల్లో వెలుగు నింపాలనే ఉద్దేశంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, తాత్కాలికమైన ప్రలోభాలకు లొంగి ఓటు వేయవద్దని సూచించారు. డబ్బులు ఎరచూపి ఓట్లు కొనుక్కోవడానికి బిజినెస్ మ్యాన్లు రాజకీయ నేతల రూపంలో మీ ముందుకు వస్తున్నారని, వాళ్లు ఇప్పుడు పెట్టుబడి పెట్టి అంతకు 100 రెట్లు సంపాదించడమే ధ్యేయంగా పనిచేస్తారని వివరించారు. ప్రజలందరి జీవితాల్లో వెలుగు నింపాలని, సమాజంలో మార్పులు తీసుకురావాలనే ఆశయంతో తాను పోటీలో నిలబడ్డానని, ఆశీర్వదించాలని కోరారు.

వైసిపికి యాతల మద్దతు : పిల్లి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తరాంధ్రలో యాతల డిమాండ్లను సాధించుకునేందుకు తామంతా వైసిపికి మద్దతు తెలుపుతున్నట్లు ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు పిల్లి నూకరాజు తెలిపారు. అక్కయ్యపాలెం నరసింహనగర్‌లోని ఆయన స్వగృహంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం సాధించిన ఫలితాలను, ముఖ్యమంత్రి వద్ద ఉంచిన ప్రతిపాదనల గురించి వివరించారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏడు సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని 30,763 యాతలకు ఏటా సుమారు రూ.50 కోట్ల లబ్ధి పొందిన విషయాన్ని గుర్తుచేశారు. యాత ఓటర్లు వైసిపికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిల్లి సుజాత, గొడ్డి కన్నారావు, సంపంగి మంగరాజు, బసవమాని ఈశ్వరావు, పిల్లి నూకరాజు, సిమ్మా గోవింద్, దంగేటి గురుమూర్తి, కొల్లి రవణమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
ఆదివారం
12 మే 2024

కలం మాట




నందనవనాన్ని నిర్మించుకో..!

ఎన్నికలంటే ఇలా వచ్చి
అలా వెళ్లిపోయే పండగ కాదు..
రాబోయే ఐదేళ్లలో
నువ్వు నడవాల్సిన బాట..
చీకట్లు కమ్ముకోవాలన్నా...
వెలుగులు విరజిమ్మాలన్నా...
పక్కవాడి చేతిలోనో..
పైవాడి చేతిలోనో లేదు
మనం వేసే
విలువైన ఓటులోనే ఉంది.

నలుగురు నడిచే దారిలో
పచ్చగడ్డి కూడా మొలవదు..
ఇతరుల పాదాల కింద
నేనెందుకు నలిగిపోవాలన్న
దాని చైతన్యం చూడు..
ఆపాటి చైతన్యం మనకు లేదా?

ప్రలోభాలకు లొంగిపోకు..
మాయమాటలకు మోసపోకు..
మన ఓటుతో
మన నందనవనాన్ని
మనమే నిర్మించుకుందాం...

విశ్వశాంతి (వై.అప్పారావు),
మొబైల్ : 89194 15804



దేశం ఎదురుచూపు

నోటుతో ఓటును కొందామని
తపనతో వాడు నీ ముందు
మందు, విందులతో హాజరు
దశాబ్దాలుగా దేశం ఎదురుచూపు
విజ్ఞత గెలిపించే ఎన్నికల కోసం...

ఓటు విలువ

ఎన్నికల్లో ఓటేయడమంటే
శ్వాసను సింహాసనం చేయడం
ఆ త్యాగం విలువ ఓ జాతీయగీతం
నీతిగా నిలబెడితే నీ ఓటు విలువ
అంతరిక్షంతో కరచాలనం చేస్తూ...

- డాక్టర్ కెజి.వేణు, విశాఖపట్నం

ఉత్తరను ఉత్తమంగా తీర్చిదిద్దుతా!

● కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు



ఉత్తర నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు

ప్రజాశక్తి - సీతమ్మధార : తాను ఉత్తర ఎమ్మెల్యేగా గెలిస్తే, ప్రజా సమస్యలను పరిష్కరించి, సౌకర్యాలను మెరుగుపరిచి ఉత్తర నియోజకవర్గాన్ని ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఇండియా బ్లాక్ బలపరిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు అన్నారు. శనివారం ఉదయం ప్రజాశక్తి విలేకరితో మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అందించే పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా అందేలా చర్యలు చేపడతానన్నారు. రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్, ఆసుపత్రి సూపర్ మార్కెట్, యువతకు క్రీడా ప్రాంగణం ఇలా అన్నివార్డుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తానన్నారు. గత ప్రభుత్వాల వైఫల్యం వల్ల ఉత్తరంలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు విచ్చలవిడిగా లభ్యమై, యువతను వాటికి బానిసలను చేస్తున్నట్లు ఆరోపణలున్నాయని, దానిపై ప్రత్యేక నిఘా పెట్టి నియంత్రించేందుకు కృషి చేస్తానన్నారు. ఉత్తర నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి, మహిళలకు స్వయంఉపాధి కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతానని, మల్టిప్లెక్స్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. విద్యాలయాలు, గుడులు, ఆసుపత్రులకు దూరంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. బిజెపికి తొత్తులుగా ఉన్న కూటమి, వైసిపి నిర్వాకం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్రంగా గండిపడిందన్నారు. కాంగ్రెస్‌తోనే ఎపికి ప్రత్యేకహోదా, విభజన హామీలు, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగసంస్థల పరిరక్షణ సాధ్యమన్నారు. లౌకిక భావాలున్న సిపిఎం, సిపిఐ, ఆమ్‌ఆద్మీ, వంటి పార్టీలన్నీ ఇండియాబ్లాక్‌గా ఏర్పడి, రాష్ట్రాన్ని బిజెపి కబంధ హస్తాల నుంచి రక్షించాలని కృషి చేస్తున్నాయన్నారు. ప్రజలంతా తమ వంతు బాధ్యతగా ఇండియా బ్లాక్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఫోరం ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఉత్తర ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపిగా సత్యారెడ్డిని హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.



వంచకులను తరిమికొట్టాలి..!



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమైన పోలింగ్ ప్రక్రియకు సోమవారంతో ముగింపు కానుంది.పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపునకు మధ్య మూడు వారాల వ్యవధి వుండడంతో అభ్యర్థులు తమ గెలుపోటములపై అంచనాలు, లెక్కలు వేసుకోవడమే మిగిలివుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలనుంది. అక్కడ నుంచే ప్రజల జీవితాలు ఎలా వుండబోతున్నాయో కూడా అర్థం కానుంది.ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి, కూటమిలోనిటిడిపి, జనసేన, బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టో చుట్టూ తిరిగాయే తప్ప, ప్రాంత ప్రజల తాత్కాలికమైన, లేదా సుదీర్ఘకాలంగా వున్న వాస్తవ సమస్యలేంటి? వాటి పరిష్కారానికి తమ ముందున్న మార్గాలేమిటి? వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధికి, యువత ఉపాధికి, విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు తమ ముందున్న ఆలోచనలు, ప్రాధాన్యతలు ఏంటనేది చెప్పలేకపోయాయి.ఓటర్లను ప్రలోభపెట్టి గెలవాలన్న దిగజారుడుతనాన్ని ప్రదర్శించాయే తప్పితే, ప్రజల మనసు గెలిచి, విలువలను నిలబెట్టే పనికి ఆయా పార్టీలేవీ చేయలేదు. గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని వంచించడమే గానీ, తన పదవీకాలంలో ఈ ప్రాంత అభివృద్ధికి ఫలానా పనిచేశానని ధైర్యంగా చెప్పుకొనేందుకు ఒక్క నమూనా కూడా చూపించుకోలేని, చెప్పలేని దుస్థితిలో వీరు తిరిగారు.

ఈ తరహా అభ్యర్థులు డబ్బులు వెదజల్లి, ఓటర్లను మత్తులో దించి, మైమరపించి గెలవాలన్న కుతంత్రాలకు వ్యూహాలు పన్నారు. పోలింగ్‌కు ఒక్కరోజే గడువున్న నేపథ్యంలో, ఇదే



తమకు ఐదేళ్లపాటు భిక్ష పెడుతుంది గనుక బరితెగించి వ్యవహరిస్తున్నారు. పెట్టిన ఖర్చు, ఓటర్లకు పంచిన డబ్బుతో తమ విజయం ఆధారపడి వుందని నమ్మిన నయవంచకులు పోటీలో వున్నారు. డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేయడం, తరువాత సొమ్ము చేసుకొనేందుకు ఎన్నుకొనే ప్రజలపైనే స్వారీ చేయడం పాలక పార్టీలకు అలవాటైంది. ప్రజాస్వామిక విలువకు పట్టం కట్టే రోజు రాలేదని, రాదనుకొని డబ్బున్న వారంతా వ్యాపారాల నుంచి రాజకీయాల్లోకి ఎగబడుతున్నారు. మనిషి ముఖం చూసి గుర్తుపట్టలేని స్థానికేతరులు కూడా ఈ ధీమాతోనే ఈ ప్రాంతంపై వాలిపోతున్నారు. పలకరించేందుకు ఊర్లో మనిషి లేకపోయినా గెలుపు తనదేనంటూ విర్రవీగుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన, ఈ ప్రాంత ప్రజలకు దక్కాల్సిన, చెందాల్సిన వనరులను గెద్దల్లా తన్నుకుపోవడానికి పోటీపడుతున్నారు. ఆ పోటీదారులకు ప్రధాన పార్టీల స్థానిక పోటీదారులు తోడై అమాయక ప్రజలను నిలువునా మోసగించ బూనుతున్నారు.రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి సహకరిస్తూ వచ్చిన టిడిపి, జనసేన, బిజెపి కూటమి సహా వైసిపికి గుణపాఠం చెప్పాలి. 60 నెలల పాటు తమకు భయం, భీతి, నష్టం లేని, భారం వేయని సిపిఎం, సిపిఐ, వామపక్షాలతో కూడిన ఇండియా బ్లాక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం ఈ ఎన్నికల్లో ఓటర్లుముందున్న తక్షణ ఆవశ్యకంగా కన్పిస్తోంది. ప్రత్యామ్నాయ విధానాలతో, అభివృద్ధి ప్రణాళికలతో, స్టీల్‌ప్లాంట్ పరిరక్షించుకోవాలన్న సంకల్పంతో ప్రజాపోరాటాల అనుభవం కల్గిన ఇండియాఫోరం బలపర్చిన గాజువాక సిపిఎం అభ్యర్థి మరడాన జగ్గునాయుడు, పశ్చిమ నియోజకవర్గ సిపిఐ అభ్యర్థి అత్తిలి విమలను ఎన్నికల్లో ప్రజలు మనస్ఫూర్తిగా ఆదరించి గెలిపించాలి.. బలహీనపడుతున్న ప్రజాస్వామిక విలువలను బతికించాలి. ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలిచ్చి, ప్రజలను వంచించే పార్టీలకు ఎన్నికల్లో రాజకీయ భిక్ష పెట్టకుండా, ఓడించి ప్రజా బోనులో నిలబెట్టాలి. ఓటుతో తరిమికొట్టాలి.

ధన రాజకీయాల అడ్డాగా తాజా ఎన్నికలు

కానరాని రాజకీయ అంశాల ప్రస్తావన : సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి



మాట్లాడుతున్న సిపిఐ నేత సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రస్తుత ఎన్నికల్లో ధన రాజకీయాలు అధికం కావడం దురదృష్ట కరమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం విపరీతంగా డబ్బులు పంచడం దుర్మార్గమన్నారు. తాజా ఎన్నికల్లో రాజకీయ అంశాలు మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలే ఎక్కువయ్యాయన్నారు. ఎన్నికల్లో ఓటమి ఖాయమని కేంద్రంలోని నరేంద్ర మోడీకీ, రాష్ట్రంలో జగన్‌కు అర్థమైందన్నారు. మోడీ ఓట్ల కోసం మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తుంటే జగన్ ప్రసంగాల్లో నిరాశా,నిస్పృహలు కనిపిస్తున్నాయన్నారు. పదేళ్ల పాలనలో చేసిన పనులు చెప్పకుండా, ప్రధానిమోడీ మత పరమైన భావోద్వేగాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారన్నారు. ఉపాధి పథకానికి నిధులు కేటాయించక ఆ పథకాన్ని నిర్వీర్యం చేసి వలసలుపెరిగేలా చేశారన్నారు. వంటగ్యాస్ ధరను మూడింతలకు దాదాపు రూ.1200 పెంచి, ఎన్నికలకు ముందు ఓట్ల లబ్ధికోసం స్వల్పంగా తగ్గించారన్నారు. బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై రెజ్లర్లు లైంగిక వేధింపులపై కనీస చర్యల్లేవని విమర్శించారు. కేజ్రీవాల్‌కు బెయిల్ రావడం మోడీకి చెంప పెట్టని అన్నారు. రాష్ట్రంలో ఏడుసార్లు విద్యుత్‌ఛార్జీలు పెంపు, చెత్తపై పన్ను విధింపు, నిత్యావసరాల ధరలు మోత, ఆర్‌టిసి ఛార్జీల వాతతో ప్రజలను సిఎం జగన్ మోయలేని భారాలు మోపార న్నారు. రాష్ట్రంలోని తెలుగుదేశం, బిజెపి, జనసేన అపవిత్ర కలయిక అని విమర్శించారు. సిపిఐ, కాంగ్రెస్, సిపిఎం, ఆమ్ ఆద్మీ, సమాజ్ వాది పార్టీ, ఎన్‌సిపి, శివసేన, డిఎంకె, ఆర్‌జెడి తదితర పార్టీల ఇండియా బ్లాకుకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, పశ్చిమ సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుతరావు పాల్గొన్నారు.

దక్షిణంలో వాసుపల్లి భారీ రోడ్ షో



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న వాసపల్లి గణేష్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ప్రచారం ముగింపు రోజైన శనివారం వైసిపి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ భారీ రోడ్‌షో నిర్వహించారు.ఎవిఎన్ కళాశాల వద్ద నుంచి చేపట్టిన రోడ్ షోలో వందల సంఖ్యలో మోటార్ బైక్స్, ప్రచార రథాలు పాల్గొన్నాయి. రెల్లి వీధి మీదుగా కలెక్టర్ ఆఫీస్, కెజిహెచ్ డౌన్, లేపాక్షి జంక్షన్, పూర్ణ మార్కెట్, పాత పోస్టాఫీస్, పూర్ణా మార్కెట్, దుర్గాలమ్మ గుడి, రామకృష్ణ థియేటర్, కొబ్బరి తోట ,కెప్టెన్ రామారావు జంక్షన్ మీదుగా అల్లిపురం మెయిన్ రోడ్డు జ్ఞానాపురం, రైల్వే స్టేషన్ రోడ్డు, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, పార్టీ దక్షిణ పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, డాక్టర్ మూగి శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణంలో వాసుపల్లితో పాటు, ఎంపి అభ్యర్థి బొత్స ఝాన్సీ విజయం సాధించడం ఖాయం అన్నారు. ప్రజల ఆదరణతో రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్ల పరిశీలన

సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ మల్లికార్జున



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: సార్వత్రిక ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లేందుకు, తిరిగి స్వీకరించేందుకు అనుగుణంగా ఎయులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఇవిఎంల పంపిణీకి ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ క్యాంపస్‌లో చెరో ఏడు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం జరగనున్న ఎన్నికలకు పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఆదివారం ఉదయం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున శనివారం సాయంత్రం పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల ఆర్‌ఒలకు, నోడల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా మెటీరియల్ పంపిణీ ప్రక్రియ సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. సిబ్బంది వచ్చి మెటీరియల్ తీసుకునేందుకు వీలుగా నియోజకవర్గాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. జర్మన్ హ్యాంగర్ల సాయంతో టెంట్లు వేశారు. సిబ్బంది ఆయా కౌంటర్లకు సులభంగా చేరుకునేలా సమాచారం తెలుపుతూ ఎక్కడికక్కడ సైన్ బోర్డులు పెట్టారు. రూట్ల వారీగా సిబ్బంది వచ్చి సామగ్రి తీసుకునేందుకు వీలుగా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా అన్ని జాగ్రత్తలు వహించాలని అక్కడ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్,ఉన్నారు.

జిల్లాలో ఎన్నికల పరిశీలకుల వివరాలు

ఎంవిపి కాలనీ : ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు వివిధ ఎన్నికల పరిశీలకును ఎన్నికల సంఘం నియమించింది. వీరు జిల్లాలో ఆయా నియోజకవర్గాల పరిధిలో అందుబాటులో ఉంటారు. వివరాలివి.

- పార్లమెంటు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు
  అమిత్ శర్మ : 63003 10152
- పోలీసు పరిశీలకులు అమిత్ కుమార్ : 63003 15841
  వ్యయ పరిశీలకులు రెంగ రాజన్ (63003 01726)
- ఎస్.కోట, పశ్చిమ, గాజువాక నియోజకవర్గాల
  సాధారణ పరిశీలకులు సీతారామ్ జాట్ : 63003 20829
- భీమిలి, తూర్పు, దక్షిణ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు
  సౌమ్య పాండే జైన్ : 63003 16752
- ఉత్తరం, పశ్చిమ, గాజువాక, పెందుర్తి వ్యయ పరిశీలకులు
  అక్షా జైన్ : 63003 19204

మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించనున్న పోలింగ్ సిబ్బందికి మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది.సాధారణ, పోలీసు,వ్యయ పరిశీలకుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున శనివారం ఉదయం కలెక్టరేట్ విసి హాలు నుంచి ఈ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమయ్యే సిబ్బంది 13,069 మందిని పోలింగ్ కేంద్రాల వారీగా జిల్లా ఎన్నికల అధికారి కేటాయించారు. అలాగే మైక్రో అబ్జర్వర్లను కూడా పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియలో పార్లమెంటు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ, పోలీసు పరిశీలకులు అమిత్ కుమార్, ఎస్.కోట,పశ్చిమ, గాజువాక నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు సీతారామ్ జాట్, పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్‌ఒ కె. మోహన్ కుమార్ పాల్గొన్నారు.

జోరుగా జగ్గునాయుడు ప్రచారం



జగ్గునాయుడుకు మద్దతుగా గాజువాకలోని పలు ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం కార్యకర్తలు

ప్రజాశక్తి -గాజువాక: స్టీల్‌ప్లాంట్ రక్షణకు గాజువాక ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని, ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం జగ్గునాయుడు పిలుపునిచ్చారు. శనివారం వడ్లపూడి రైల్వేక్వార్టర్స్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా వాకర్స్‌తో మాట్లాడారు.విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైన తర్వాతే గాజువాక అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, అలాంటి స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుకు అమ్మేయాలని కేంద్రంలోని బిజెపి కుట్ర చేస్తోందన్నారు. బిజెపితో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకుని టిడిపి, జనసేనలు, పరోక్షంగా అన్ని విధానాలు, నిర్ణయాలకు సహకరిస్తూ పరోక్షంగా వైసిపిలు రాష్ట్రం, ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు జరుగుతున్న ఉద్యమాల్లో జెఎసి చైర్మన్‌గా తాను అన్నింటా పాల్గొన్నానని, ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కు కార్పొరేటీకరణపై మరో అ డుగు ముందుకు వేయకుండా అడ్డుకోవాలంటే చట్టసభల్లో దీనిపై తీవ్రంగా ప్రతిఘటించేందుకు, పోరాడేందుకు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతోపాటు వడ్లపూడి, శ్రీనగర్ పరిసర ప్రాంతాల వాసులు అదానీ గంగవరం పోర్టు కాలుష్యంతో పడుతున్న ఇబ్బందులపైనా, విశాఖ డెయిరీ కాలుష్యంతో సతమతమౌతున్న 14 గ్రామాల సమస్యల పరిష్కారానికి ఈ ప్రాంత ప్రతినిధిగా చట్టసభల్లో ప్రశ్నించేందుకు తనను ఎమ్మెల్యేను చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్ను విధింపు, నూతన ఆస్తి పన్నుపై ఈ ప్రాంత సిపిఎం కార్పొరేటర్‌గా డాక్టర్ బి.గంగారావు ఇప్పటికే పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. గాజువాక ట్రాఫిక్ సమస్య, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణం, పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి ఉద్యమపార్టీ తరపున పోటీలో ఉన్న తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఎస్‌వికె.పరశురామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో వార్డు, నివాస్ నాయకులు త్రినాధస్వామి, వాకర్స్ పాల్గొన్నారు.

జగ్గునాయుడు గెలుపును కాంక్షిస్తూ బైక్ ర్యాలీ

ఇండియా ఫోరం బలపరిచిన గాజువాక సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు విజయాన్ని కాంక్షిస్తూ శనివారం గాజువాకలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాతయ్యపాలెంలో బైక్‌ర్యాలీని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి పద్మ ప్రారంభించగా, మింధి, అప్పన్నకాలనీ, జోగవానిపాలెం, పాత గాజువాక, చిట్టి నాయుడు కాలనీ, దశమకొండ ప్రాంతాల మీదుగా సాగింది. సిపిఎం జెండాలు, టోపీలను పెట్టుకుని పెద్దసంఖ్యలో సిపిఎం, ఇండియాబ్లాక్ కేడర్, అభిమానులు నిర్వహించిన బైక్‌ర్యాలీలో గాజువాకలోని పలు వీధులు ఎరుపెక్కాయి. బైక్‌ర్యాలీలో ఆర్‌కెఎస్‌వి.కుమార్, లోకేష్, కిరీటం, పల్లెలు నర్సింగరావు పాల్గొన్నారు.

యాదవ జగ్గరాజుపేటలో..

విశాఖపట్నం : ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడును గెలిపించాలని కోరుతూ శనివారం యాదవ జగ్గరాజుపేటలో ప్రచారం నిర్వహించారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేష్, సిబ్బంది టి.అప్పలరాజు, జె.ధనుంజయ్, ఆర్‌కె.నాయుడు, పి.ప్రదీప్, బి.పాపారావు, ఎస్.సత్యమూర్తి, శివప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థి గణేష్ ప్రచార ర్యాలీ



ప్రచార ర్యాలీలో పాల్గొన్న వైవి.సుబ్బారెడ్డి, వైసిపి అభ్యర్థి గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం మధ్యాహ్నం పట్టణంలో భారీ ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. నర్సీపట్నం సిబిఎం కాంపౌండ్ నుంచి ప్రారంభమై, పోలీస్ స్టేషన్, కృష్ణాబజార్, అబీద్ సెంటర్, ఆర్‌డిఒ కార్యాలయం, శ్రీకన్య జంక్షన్, పెదబొడ్డేపల్లి మీదుగా సాగిన ర్యాలీలో ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్ ఒక్కడిని ఎదుర్కోనలేక అందరూ ఒక్కటై కూటమిగా ఏర్పడినా, ప్రజాదరణతో వచ్చే ఎన్నికల్లో వైసిపిదే విజయమన్నారు. నర్సీపట్నం ఎమ్మెల్యేగా గణేష్ పట్టుదల, కృషితో రూ.500కోట్లతో మెడికల్ కాలేజీ, ఇతరత్రా పలు అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో నర్సీపట్నం ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా పోటీలో నిలిచిన గణేష్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, పలువురు ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పార్టీ కేడర్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే అంగన్వాడీ, ఆశా వర్కర్లకు అలవెన్స్ ఇవ్వాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఈనెల 13వ తేదీన జరుగు సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అంగన్వాడీ, ఆశా వర్కర్లకు ఇతర ప్రభుత్వ అధికారుల వలె అలవెన్సులు ఇవ్వాలని సిఐటియు మండల గౌరవాధ్యక్షులు ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల రోజున ఉదయం 6 గంటల నుంచి ఎన్నికల ముగిసే వరకు వైద్య శిబిరాలు, ఇతర విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ, ఆశాలకు మధ్యాహ్నం భోజనంతో పాటు ఇతర సదుపాయాలు కల్పించి ఇతర ఉద్యోగులు వలె అలవెన్సులు ఇవ్వాలని, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో డైట్‌కు తృతీయ స్థానం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్ఎస్‌టిఎల్ వైజ్ఞానిక ప్రదర్శనలో అనకాపల్లి డైట్ కళాశాల విద్యార్థులు మూడవ స్థానం సాధించారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్‌టిఎల్ - డిఆర్‌డిఓలో మూడు రోజుల పాటు జరిగిన సాంకేతిక దినోత్సవ వేడుకలు శనివారం ముగిసాయి. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనకు 115 ప్రాజెక్టులు రిజిస్టర్ కాగా, 48 ప్రాజెక్టులు పోటీలో పాల్గొన్నాయి. డైట్ కళాశాలకు చెందిన సెల్ఫ్ రిపేరింగ్ కాంక్రీట్ అందరి సైంటిస్టుల మన్ననలు పొందడమే కాకుండా పోటీల్లో తృతీయ స్థానాన్ని సంపాదించుకుంది. అనంతరం ప్రాజెక్ట్ రూపొందించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ గైడ్ ఆదారి దేవి ప్రసాద్ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులు చేసేవిధంగా డైట్ కళాశాల విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు. పోటీల్లో తృతీయ స్థానం రావడం పట్ల కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి ఆదారి దేవి ప్రసాద్, డీన్ అకాడెమిక్స్ కె.పార్వతి, డీన్ అడ్మినిస్ట్రేషన్ కెఎస్.ఈశ్వరరావు, అసోసియేట్ డీన్ అకాడెమిక్స్ కృష్ణ నాగ్, వివిధ విభాగాధిపతులు డైట్ ఆర్ అండ్ డి కోఆర్డినేటర్ డాక్టర్ నళిని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్నికలు విధులకు హాజరవుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని పిఆర్‌టియు నాయకులు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు డి గోపీనాథ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వలే ఎన్నికల సిబ్బంది డ్యూటీ పడిన ప్రాంతానికి వెళ్లి, రావడానికి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని, బస్సులు ఎన్ని గంటలకు ఎక్కడ నుంచి బయలుదేరుతాయో పూర్తి వివరాలతో ఆర్వోస్ అధికారుల నుంచి ప్రకటన ఇప్పించాలని కోరారు. ఎక్కడ నుంచి సామాగ్రిని తీసుకొని బయలు దేరాలో ఎన్నికల అనంతరం తిరిగి సామాగ్రిని ఎక్కడ అప్పగించాలో ప్రకటించాలన్నారు. సామాగ్రి ఇచ్చే సమయంలోనూ, తిరిగి పుచ్చుకునే సమయంలోనూ ఎన్నికల సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. నిబంధన ప్రకారం మెనూ, పారితోషకాలు, సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్ది నాయుడు, గంట్ల కృష్ణ, అలంక ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

టిడిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో శనివారం ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, కూటమి నాయకులు రిక్విత్, దాట్ల శ్రీను రాజు, రఘువర్మ, కుంచ అంజిబాబు, బాలి బోయిన సంతోష్ యాదవ్, కుమార్ అప్పారావు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నల్లరేగులపాలెం గ్రామంలో వైసీపీ నుండి పలువురు టిడిపిలో చేరినట్లు నల్లరేగుల పాలెం మాజీ సర్పంచ్ టిడిపి నేత కె.కృష్ణంరాజు తెలిపారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు సాయినాథరావు సమక్షంలో నల్లరేగులపాలెం మాజీ ఉపసర్పంచ్ కాయిత రమణ, నారపాడు గ్రామానికి చెందిన రాజాన వెంకన్న, గొలగాని అప్పారావు, ఎం సత్యనారాయణ, జె. రాము, రాజన్న శ్రీను, ఎం ఆనంద్, నారపాడు ఉప సర్పంచ్ బర్ల ముత్యాలు, రాజాన శ్రీను, బొట్ట వెంకట్, ఈగల వెంకట్, నామాల అప్పారావు, తోకాడ గణేష్ తదితరులు టిడిపిలో చేరారు.

బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్ మనుషులను అనకాపల్లి జిల్లా నుండి ఖాళీ చేయించాలి

సిపిఎం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో సీఎం రమేష్ తన మనుసులను వేలాది మందిని తీసుకొచ్చి విజయ రెసిడెన్సీ, ఇతర ప్రైవేటు హోటళ్ళు, హైవేలో ఒక ప్రయివేట్ బంగ్లా, వివిధ మండలాల్లోని ప్రత్యేకమైన ఇళ్లు, హోటళ్లను అద్దెకు తీసుకొని ఉంచారని, వారిని వెంటనే ఖాళీ చేయించి అనకాపల్లి జిల్లా బయటకు పంపించాలని సిపిఎం అనకాపల్లి మండలం కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, సభ్యులు కాళ్ళ తేలయ్యబాబు, బొప్పే ఉమామహేశ్వరరావు స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానికేతరులు బయటికి వెళ్లినప్పుడే అనకాపల్లి జిల్లాలో ఎన్నికలు సజావుగా జరుగుతాయని తెలిపారు. బయట జిల్లాకు చెందిన సిఎం.రమేష్ మనుసులు ఇక్కడ ఉన్నట్లయితే ఎన్నికల్లో అల్లర్లు సృష్టించే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల అధికారులు, పోలీసులు వెంటనే వారిపై తగు చర్యలు తీసుకొని జిల్లాలో శాంతిభద్రతలు విఘాతం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అనేక అరాచకాలు, అక్రమాలకు పాల్పడిన సీఎం రమేష్‌పై ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు.

బిజెపి, సిఎం.రమేష్ మాటలు నమ్మొద్దు

పదేళ్ల నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పోలవరం ప్రాజెక్టుకు కనీస నిధులు ఇవ్వలేదని, అలాంటిది ఈ సారి అధికారంలోకి వస్తే రెండేళ్లలో పోలవరం పూర్తి చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెప్పడమంటే ఏపి ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నమేనని పేర్కొన్నారు. ఈ ప్రాంతంపై కనీస అవగాహన లేని సీఎం రమేష్, తనను గెలిపిస్తే ప్రాజెక్టులు, కంపెనీలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీర్ఘకాలంగా రాజ్యసభ సభ్యులుగా ఉన్న సిఎం.రమేష్ విశాఖ స్టీల్‌ప్లాంట్, విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్ర అభివృద్ధి నిధులు, ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలపై ఏనాడూ నోరు విప్పలేదని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి నేడు నేడు అభివృద్ధి చేస్తామంటే ఇక్కడ నమ్మేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు. సీఎం రమేష్‌ని ఓడించడం ద్వారా తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీ చేయుచున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి కోరారు. సాధారణ పరిశీలకులు దల్జీత్ సింగ్, రాకేష్ కుమార్ సమక్షంలో శనివారం కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 72 గంటల సమయంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం మొదలైనవి నిషిద్ధమని చెప్పారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురుకు మించకుండా ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చన్నారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి ఎన్నికల ప్రచారానికి తెరపడుతుందని తెలిపారు. ఓటర్లపై ఎలాంటి ప్రభావం ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఎన్నికల కమిషన్ 48 గంటల సైలెన్స్ పీరియడ్‌ను అమలు చేస్తోందన్నారు. సైలెన్స్ పీరియడ్ శనివారం సాయంత్రం 6.00 గంటలకు ప్రారంభమై మే 14న ముగుస్తుందని చెప్పారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 126 ప్రకారం 48 గంటల ముందు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా మాధ్యమాల్లో ప్రసారాలు నిషిద్ధమని చెప్పారు. నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. వెలుపల నుండి వచ్చిన రాజకీయపార్టీల కార్యకర్తలు ఇతర ప్రచార కార్యకర్తలు, ఓటర్లు కాని వారు వెళ్లిపోవాల్సి వుంటుందని చెప్పారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు సమాచారం అందితే వెంటనే తెలియజేయవచ్చని, విచారణ అనంతరం దోషులుగా నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలింగ్ బూత్‌ను కనుగొనడంలో ఓటింగ్ ప్రక్రియను అర్థం చేసుకోవడంలో సహాయానికి సహాయక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వృద్ధ, వికలాంగ ఓటర్లకు సహాయం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. 13వ తేదీన పోలింగ్ సజావుగా, సురక్షితంగా సాగేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంత పోలింగ్ నిర్వహణకు జిల్లా అంతటా పటిష్ట భద్రతా నిబంధనలు అమలులో ఉన్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద అదనపు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి పార్లమెంటు మెంబరుగా పోటీ చేయుచున్న అభ్యర్థులు, అభ్యర్థుల ఏజెంట్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.రామ్మూర్తి, డిటి రవిబాబు, ఎస్ఎ తులసీరామ్ పాల్గొన్నారు.

ప్యాకేజీకి అమ్ముడుపోయిన మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి- సబ్బవరం

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ సామాజిక వర్గ ఉద్యమాన్ని తాకట్టు పెట్టి బిజెపి, ఎన్‌డిఎ కూటమి ప్యాకేజీకి అమ్ముడుపోయారని ఆ సంఘం మండల అధ్యక్షులు దువ్వు దుర్గారావు ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమికి మందకృష్ణ మాదిగ మద్దతు ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ ఎపి మాదిగ దండోరా ఐక్య కూటమి తీర్మానం చేసిందని తెలిపారు. ఎస్సీల ఎబిసిడిల వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మాదిగలు తమ ప్రాణాలను బలిదానం చేసి సుదీర్ఘ పోరాటం చేస్తున్నా ఏనాడూ బిజెపి ప్రభుత్వంలో చలనం లేదని, అలాంటి బిజెపికి మంద కృష్ణమాదిగ ఉద్యమాన్ని తాకట్టు పెట్టడం దారుణమన్నారు. కృష్ణమాదిగ నిర్ణయానికి తాము మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. యావత్తు మాదిగ సామాజికవర్గం ఐక్యతతో రాష్ట్రంలోని వైయస్.జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ, వైసిపికే ఓట్లు వేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఐడి బాబు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్ము కనకరాజు, నాయకులు టేకేటి లక్ష్మణరావు, ఇందుగుబిల్లి గోపి, బోరా జయరాజ్, కొమ్ము కోటి తదితరులు పాల్గొన్నారు.

మాదిగల మధ్య చిచ్చు పెడితే సహించేది లేదు

ప్రజాశక్తి- సబ్బవరం

రాజకీయంగా మాదిగల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తే సహించేది లేదని ఎంఆర్‌పిఎస్ అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొటివాడ సామ్రాట్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, రెల్లి హక్కుల పోరాట సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి మద్దతుగా మంద కృష్ణ మాదిగ నిర్ణయమే శిరోధార్యమని స్పష్టం చేశారు. ఎన్డీయే ప్రభుత్వంతోనే ఎస్సీల వర్గీకరణ సాధ్యమని స్పష్టం చేశారు. రెల్లి హక్కుల సంఘం నాయకులు భూపతి అప్పారావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొటివాడ అప్పారావు, వంగలపూడి సంతోష్ బాబు, అయినింటి రాజు, పెట్ల ఈశ్వరరావు, డొక్కా భాస్కరరావు, నిమిడితల్లి సోమేశ్వరరావు, ఇందుగుబిల్లి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

13న ఉద్యోగులు, కార్మికులకు సెలవు ప్రకటించాలి : సిఐటియు

ప్రజాశక్తి-పరవాడ

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఉద్యోగులు, కార్మికులకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 13న సెలవు ప్రకటించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్‌టిపిసి, ఫార్మా పరిశ్రమలు, రాంకీ ఎస్ఇజెడ్, ఇండస్ట్రియల్ పార్క్, లంకెలపాలెం, పరవాడ, అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లతో పాటు జిల్లాలో అన్ని పరిశ్రమలు, షాపులు, షాపింగ్ మాల్స్ సెలవు ప్రకటించేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-నక్కపల్లి

జీవీఎంసీ 81వ వార్డ్ కార్పొరేటర్ పీలా సౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి కూరగాయల మార్కెట్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భరత్‌కుమార్ సతీమణి నివేదిత, కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య, వార్డు ఇన్చార్జ్ పీలా రాంబాబు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి చింతల గొర్లివానిపాలెంలో శుక్రవారం రాత్రి వైసిపి నాయకులు గొర్లి గోపి ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలునాయుడును, ఎమ్మెల్యేగా అదీప్ రాజ్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చిప్పాడ రామారావు, గొర్లి రామారావు, పోలిరెడ్డి అప్పారావు, చీపురుపల్లి దేముడమ్మ, మహిళలు పాల్గొన్నారు.

పోటాపోటీగా సాగిన ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-కశింకోట : ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్, శాసనసభ ఎన్నికలకు సంబంధించి ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. మండలంలో గత నెల రోజులుగా ఎన్నికల ప్రచారం పోటాపోటీగా సాగింది. అనకాపల్లి అసెంబ్లీకి వైసిపి అభ్యర్థిగా మలసాల భరత్‌కుమార్, కూటమి తరుపున జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ, ఇండియా వేదిక తరుపున కాంగ్రెస్ అభ్యర్థిగా ఐఆర్.గంగాధర్, అనకాపల్లి పార్లమెంట్‌కు వైసిపి తరుపున బూడి ముత్యాలనాయుడు, కూటమి తరుపున బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్, ఇండియా వేదిక తరుపున కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్ పోటీలో ఉన్నారు. ఆయా పార్టీలు మండలంలోని అన్ని గ్రామాల్లో నువ్వా నేనా అన్నట్టు ప్రచారం నిర్వహించాయి. ప్రచారం ముగిసింది. 13న జరగనున్న ఎన్నికల్లో మండల ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.

ఓటుకు వెయ్యి చొప్పున పంపిణీ

బుచ్చయ్యపేట : సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. బహిరంగ సభలు, ఇంటింటి ప్రచారాలు, లౌడ్ స్పీకర్లతో ప్రచారాలు ముగిసాయి. రాజకీయ పార్టీల ప్రచార వాహనాలు వెనుతిరిగాయి. గ్రామాల్లో తెలుగుదేశం, వైసీపీలకు చెందిన నాయకులు గ్రామాల్లో ఓటర్లకు తాయిలాలు పంపిణీకి సిద్ధమయ్యారు. ఇరు పార్టీలకు చెందినవారు ఓటుకు వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీ చేస్తున్నారు.

తల్లీ కూతుర్లకు దార్ల బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు ప్రదానం

-అథ్లెటిక్స్‌లో అవార్డులు, పురస్కారాలు కైవశం

-మాతృదినోత్సవం సందర్భంగా అందజేత



అవార్డులతో నాగజ్యోతి

ప్రజాశక్తి -కొత్తకోట: మాతృ దినోత్సవం సందర్భంగా దార్ల బుక్ అఫ్ వరల్డ్ రికార్డును తల్లీకూతుళ్లు అందుకున్నారు. వీరిద్దరూ వివిధ రంగాలలో కనపరిచిన వారి ప్రతిభను గుర్తిస్తూ హైదరాబాద్‌కు చెందిన దార్ల ఆర్గనైజేషన్ వీరికి దార్ల బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను మాతృ దినోత్సవం సందర్భంగా తల్లి, తనయలీద్దరికీ ఈ అవార్డు/రికార్డు ను అందజేశారు. రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కలగర్ల నాగజ్యోతి ఉపాధ్యాయు నిగా విధులు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థుల్ని నిష్ణాతులుగా తీర్చిదిద్దుతూనే మరోపక్క తనకి ఇష్టమైన స్పోర్ట్స్‌లో ప్రతిభ కనబరుస్తూ పలు అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో వివిధ పోటీలలో పాల్గొని ముఖ్యంగా పవర్ లిఫ్టింగు, అథ్లెటిక్స్ విభాగాలలో పాల్గొని ఎన్నో బంగారు, వెండి పతకాల ఛాంపియన్షిప్‌లు సాధించారు. అంతే కాకుండా తన నిరంతర కృషి ఫలితంగా ఎన్నో ప్రపంచ రికార్డులు(బ్రిలియంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, ఏషియా బుక్ ఆఫ్ ఓల్డ్ రికార్డ్ తదితర, మరెన్నో ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు అందుకున్నారు అలాగే తమ విద్యార్థుల్ని తీర్చిదిద్దుతూనే ఒక మాతృమూర్తిగా తన ఒక్కగానొక్క కుమార్తె అయిన కలగర్ల సాహితీ (రాష్ట్ర పతి అవార్డు గ్రహీత) ని వివిధ రంగాలలో అభివృద్ధి నడిపిస్తోంది. కుమారి కలగర్ల సాహితి సిమ్మింగ్ లో ఎన్నో అవార్డులు, రికార్డ్స్ తన సొంతం చేసుకుంది. మల్టిపుల్ టాలెంటెడ్ వండర్ కిడ్ గా ఎంతో పేరు సంపాదించింది. అటు చదువులోనూ, ఇటు క్రీడల్లోనూ రాణిస్తూ ఎంతోమంది మన్ననలను అందుకుంది. సిమ్మింగ్‌లో ముఖ్యంగా జలాశయాలు వేయడం, నీటిలో సూర్య నమస్కారాలు చేస్తూ ఇప్పటికే 32 వరల్డ్ రికార్డులు (ఆసియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, భారత్ బుక్, ఆంధ్ర బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, వండర్ బుక్, కలాం బుక్, బ్రిలియంట్ బుక్, హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, జీనియస్ బుక్,జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లు సాధించింది. ఎన్నో ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్‌ఇంగ్లీష్ ఒలింపియాడ్, సైన్స్ ఒలింపియాడ్ లలో వివిధ పథకాలు సాధించింది.అంతేకాక అంతర్జాతీయ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో ఎన్నికయి అమెరికా వాషింగ్టన్ డిసి లో తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చి తన చదివిన పాఠశాలకు, దేశానికి ఎంతో గుర్తింపును తీసుకొచ్చింది. చిన్ననాటి నుంచి ఈతలో ప్రతిభ కనబరుస్తూ ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వివిధ అవార్డులు గెలుచుకుంది.



పతకాలతో కుమార్తె సాహితీ

గతంలో రేవుపోలవరం సముద్రం నుంచి తన ప్రాణానికి తెగించి ఇద్దరు చిన్నారుల ప్రాణాలను కాపాడి సాహస బాలిక అవార్డు కూడా అందుకోవడం విశేషం. ఇలా ఎన్నో విషయాల్లో ప్రతిభ కనబరుస్తూ తల్లిని మించిన తనయగా ఎదిగింది సాహితి. ఈ సందర్బంగా నాగ జ్యోతి, సాహితి మాట్లాడుతూ ప్రస్తుతం లభించిన ఈ అవార్డులు తమ ప్రతిభ కు మరింత ప్రోత్సాహం కలిగించేదిగా ఉందన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. దీంతో ప్రధాన పార్టీలు ఓటర్లను ప్రలోభ పెట్టే పనిలో నిమగ్నమ య్యారు. ఈనెల 13న జరుగునున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రధాన పార్టీల అభ్యర్థులు గ్రామాల్లో ఇప్పటి వరకు విస్తతంగా ప్రచారం చేపట్టారు. పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయా పార్టీల మేనిఫెస్టోను ప్రజల వద్దకు తీసుకెళ్లారు. .హామీలను గుమ్మరించారు. ప్రచారం ముగియడంతో ఓటర్లను మభ్యపెట్టి ,డబ్బు ఎరచూపి ఓట్లు వేయించుకునే పనిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు నిమగ్నమయ్యారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నియంత్రించే వ్యవస్థలు ఉన్నప్పటికీ ,ప్రధాన పార్టీలు తమ పనిని తాము చాప కింద నీరులా సాగిస్తున్నారు. ఓటుకు నోటు ప్రధాన ఆయుధంగా భావించి తమ పనిని పూర్తి చేస్తున్నారు.

ఎన్నికల సిబ్బందికి అసౌకర్యం లేకుండా చర్యలు

ప్రజాశక్తి-పాడేరు : ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.వివేకానందన్, కలక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.విజయ సునీత ఆదేశించారు. శనివారం ప్రభుత్వ కళాశాల మైదానంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన కలక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షం వచ్చినా ఎటువంటి ఇబ్బంది లేకుండా వాటర్ ప్రూఫ్ షామియానా ఏర్పాటు చేయాలని, అవసరమైన ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎన్నికల సామగ్రి సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకొనే విధంగా రవాణా సదుపాయం కల్పించాలన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆదివారం పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే గీతాంజలి తెలిపారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 292 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది, సామగ్రి తరలించేందుకుగాను 28 జోన్లు, 28 రూట్ లుగా విభజించినట్లు తెలిపారు. నక్కపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం పోలింగ్ సామగ్రిని, ఎన్నికలు సిబ్బందికి అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ సామాగ్రిని పిఒ,ఏపీఓలు తన సిబ్బందితో కలిసి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకుగాను బస్సులు, ఇతర వాహనాలను సిద్ధం చేశామన్నారు.



సిద్ధంగా ఉన్న వాహనాలు

పోలీసుల కవాతు

ప్రజాశక్తి-కోటవురట్ల: ఓటు హక్కును సజావుగా ధైర్యంగా వినియోగించుకోవాలని స్థానిక ఎస్సై రమణయ్య తెలిపారు. మండల కేంద్రంలో పోలీసు కవాతు శనివారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలంతా అప్రమత్తంగా స్వేచ్ఛా యుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు.



కవాతు చేపడుతున్న పోలీసులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : అయ్యన్న

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో విజన్ డాక్యుమెంటరీ పేరుతో ప్రత్యేక మేనిపెస్టోను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గంలో విద్య, ఆరోగ్యం, మంచినీరు, లిఫ్ట్ ఇరిగేషన్, ఇంటింటికి కుళాయి, యువతకు ఉద్యోగ కల్పనే తమ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయ్యన్న



ప్రచారం చేస్తున్న బండారు

బండారు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -చీడికాడ: మండలంలో కూటమి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి ఎన్నికల ప్రచారం చేశారు. మండల కేంద్రంలో బండారు సత్యనారాయణమూర్తితో పాటు పీవీజి కుమార్, పోతుల రమణమ్మ, అడ్వకేట్ పరవాడ సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు చిన్నంనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ, మాడుగుల నియోజవర్గం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని, చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలి సామాలమ్మ, బాలకృష్ణ, గండి ముసలి నాయుడు, కార్యకర్తలు ఎర్ర అప్పారావు, వార్డు మెంబర్లు సూర్యనారాయణ, సింహాచలం, నాయుడు పాల్గొన్నారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం

పొంచివున్న ప్రమాదం

ప్రజాశక్తి -చీడికాడ: ఇటీవల రెండు రోజులు క్రితం కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం నేల వైపు వాలి ప్రమాదానికి నిలయంగా మారింది. మండలంలోని జైతువరం గ్రామం అప్పలరాజుపురం వెళ్ళు దారి మార్గంలో ఇటుకలు బట్టి సమీపాన కరెంటు స్తంభం నేలమట్టం దిశగా పూర్తిగా వాలిపోయి ఈ క్షణాన స్తంభం నేలమట్టం అవుతుందోనని ఎవరు ప్రమాదానికి గురవుతారని ప్రజల భయాందోళనకు గురవుతున్నారు. ఈమధ్య కరెంటు ప్రమాదాలకు అనేక మంది మనుషులతో పాటు మూగజీవరాసులు కూడా బలవుతుండడం మనం చుట్టూ చూస్తూ ఉన్నాము అందువలన జైత వరంలో కరెంటు స్తంభం పూర్తిగా నేలమట్టం అవకముందే ఎలక్ట్రికల్ సిబ్బంది చొరవ తీసుకొని ఈ స్తంభాన్ని సరి చేస్తారని స్థానిక గ్రామస్తులు కోరుకుంటున్నారు.



ధ్వంసం చేస్తున్న పోలీసులు

600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏటిగైరంపేట పంచాయతీ సీతకండి గ్రామ శివారులో నాటుసారా స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై బి.కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నాటుసారా తయారు చేసినా, విక్రయించిన సమాచారం ఇవ్వాలన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -అనంతగిరి: ఎన్నికల నేపథ్యంలో టీడీపీకి చెందిన కార్యకర్తలు వైసిపిలో చేరారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ తట్టవలస గ్రామనికి చెందిన సుమారు 30 కుటుంబాలు వైసిపిలో చేరినట్లు మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా తెలిపారు.



ప్రచారం చేస్తున్న విమల, ఇండియా ఫోరం నాయకులు

కొత్తపాలెంలో సిపిఐ ప్రచారం

ప్రజాశక్తి -గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గంలో ఇండియా ఫోరం నుంచి పోటీలో సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల శనివారం కొత్తపాలెం, నాగేంద్ర కాలనీ, సంతోష్ కాలనీ, తిరువీధుల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజలను సమస్యలనడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇస్తూ 13వ తేదీన జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసే గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కె.రెహమాన్, ఆర్.శ్రీనివాస్, పుష్ప, దేముడమ్మ, రవి, చిరంజీవి, లక్ష్మణరావు, అచ్యుత్, పార్టీ సానుభూతి పరులు పాల్గొన్నారు.

పాలకుల భవితవ్యాన్ని నిర్ణయించేలా తీర్పు ఉండాలి

స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : కేంద్ర, రాష్ట్ర పాలకుల భవితవ్యాన్ని నిర్ణయించేలా స్టీల్ ఉద్యోగుల తీర్పు ఉండాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ అభ్యర్థించారు. స్టీల్‌ప్లాంట్‌లోని డబ్ల్యూఆర్‌ఎమ్ క్యాంటీన్ వద్ద శనివారం స్టీల్ సిఐటియు మిల్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అయోధ్యరామ్ హాజరై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ నేటి పరిస్థితికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న రాజకీయ నిర్ణయాలే ప్రధాన కారణమన్నారు. ఈ రాజకీయ నిర్ణయాన్ని ప్రభావితం చేసే విధంగా మనందరి తీర్పు రేపు జరగబోయే ఎన్నికలలో ప్రస్ఫుటంగా కనిపిస్తేనే పాలకుల నిర్ణయాలు మారుతాయని చెప్పారు. ప్లాంట్‌ను రక్షిస్తామని హామీ ఇచ్చిన ఇండియా కూటమికి మద్దతునివ్వాలని కోరారు. పోరాటాలను బలపరుస్తూ ఉన్న సిపిఎం గాజువాక అభ్యర్థి మరడాన జగ్గునాయుడును గెలిపించడం ద్వారా ఇక్కడి ప్రజలలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలనే దృఢమైన నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంకేతంగా పంపాలని కోరారు. ఈ ఎన్నికల్లో తీర్పుపైనే ప్లాంట్, మనందరి భవిష్యత్తు ఉందన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలన్నారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన ప్లాంట్‌లోని కోకో ఒవెన్, సింటర్ ప్లాంట్, టిపిపి, ఎస్ఎంఎస్, సిఎంఎస్ తదితర విభాగాలలో సమావేశాలు నిర్వహించారు. స్టీల్ సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటిదాస్, యు రామస్వామి తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశాలలో ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు మిల్స్ కమిటీ నాయకులు డి.సత్యనారాయణ, కె.బాలశౌరి, వి.మురళి, బిఎన్.మధుసూదన్, కోయిలాడ శ్రీనివాస్, సిహెచ్ అరుణ్, వి.ప్రసాద్, రాజు, అప్పలరాజు, నాగబాబు తదితరులతోపాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ప్రలోభాలు

ఓటర్లకు డబ్బు పంపిణీ
కేడర్‌కు అందక వైసిపిలో నిరుత్సాహం?

ప్రజాశక్తి- యంత్రాంగం

గాజువాక : గాజువాక నియోజవర్గంలో తెలుగుదేశం, అధికార వైసిపి ఓటర్లను ప్రలోభ పెట్టడానికి ముందుగానే డబ్బులు పంపిణీ పూర్తి చేశాయి. రెండు పార్టీలూ ఓటుకు రూ.1,000 చొప్పున డబ్బులు పంపిణీ పూర్తి చేశాయి. తెలుగుదేశం పార్టీ నుంచి ఓటర్లతో పాటు వార్డు స్థాయిలో ఉన్న కిందిస్థాయి కార్యకర్తలు, నాయకులకు రూ.10 వేలు నుంచి రూ.25 వేలు వరకు డబ్బులు ఇచ్చినట్లు బహిరంగంగా ప్రచారం జరుగుతోంది. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాత్రం వార్డులోని కింది స్థాయి వైసిపి కేడర్‌కు డబ్బులు ఇచ్చేది లేదని చెప్పడంతో వారు అసంతృప్తితో ఉన్నారు. 66వ వార్డులో రెండు రోజులుగా అమర్‌నాథ్ డబ్బులు ఇవ్వలేదని వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్‌పై కేడర్‌లోని పలువురు తిరగబడ్డారు. ఇలా అయితే తామంతా ఓటింగ్‌కు దూరంగానే ఉంటామని చెబుతున్నారు. వార్డు స్థాయి కేడర్‌కు పంపిణీచేసేందుకు మంత్రి అమర్‌నాథ్ డబ్బులు ఇవ్వలేదని, తానేమీ చేయలేనని కార్పొరేటర్ ఇమ్రాన్ చెబుతున్నారు. స్థానికంగా ఉన్న వైసిపి కార్యకర్త సుబ్బారెడ్డితోపాటు మరి కొంతమంది ఇమ్రాన్‌పై తిరగబడి పెద్ద గలాటా జరిగినట్లు ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని అమర్‌నాథ్ దృష్టికి కార్పొరేటర్లు తీసుకెళ్లినా కేడర్‌కు తాను ఇవ్వనని చెప్పినట్లు సమాచారం. నియోజకవర్గ మొత్తం మీద ఒకటే పాలసీ అమలు చేస్తున్నానని, ఎక్కడా కేడర్‌కు ఇవ్వడంలేదని ఆయన చెబుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వైసిపి కేడర్ అసంతృప్తితో ఉన్నారు. ఇంతకాలం పార్టీ కోసం కష్టపడి చేస్తే ఎన్నికల సమయంలో కూడా తమ వైపు చూడటంలేదని ప్రతి వార్డుల్లోనూ రచ్చరచ్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. వైసిపి కార్పొరేటర్లకు మాత్రమే డబ్బులు ఇస్తే సరిపోతుందా?, ఓటింగ్ అంతా వారే చేయించేస్తారా అంటూ వైసిపి కేడర్ అసంతృప్తితో ఉన్నారు. రహస్యంగా తెలుగుదేశానికి తమ ఓట్లు వేస్తామంటూ స్థానిక నాయకులు కార్పొరేటర్ల వద్ద హెచ్చరికలు జారీచేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే నియోజకవర్గంలో గట్టి పోటీ నెలకొన్న సమయంలో వార్డులో ఇలాంటి వ్యతిరేకత రావడం ఓటింగ్‌లో ఏ మేరకు ప్రభావం పడుతుందో వేచి చూడాల్సి ఉంది.

ఓటర్ల స్లిప్పులు అందిస్తూ...

పెందుర్తి : ఎన్నికల ముందు నాయకులు ప్రలోభాలకు తెర లేపారు. నాయకులు ఓటర్లను కలిసి స్లిప్పుల పేరుతో డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఓటకు రూ.1000 వరకు అందిస్తున్నారు. పెందుర్తి నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఆరు వార్డులో సుమారు మూడు లక్షల పైబడి ఓటర్లు ఉన్నారు. వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులు సుమారు రెండు లక్షలు ఓటర్లను లక్ష్యంగా పెట్టుకొని డబ్బు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. అభ్యర్థి గెలుపు డబ్బు మీదా, నియోజకవర్గంలో అభివృద్ధిపైన ఆధారపడి ఉందా అనేది ఓటర్లలో చర్చ నడుస్తోంది. 'డబ్బులు ఏ పార్టీ వారిచ్చినా తీసుకుంటాం.. నచ్చిన వరకే ఓటు వేస్తాం' అని ప్రస్తుతం ఓటర్లనుంచి వినిపిస్తోంది.

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 13న సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు జిల్లాలో అవసరమైన ఏర్పట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి తెలిపారు. శనివారం కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్‌పి కెవి.మురళీకృష్ణతో కలసి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, ప్రతి ఓటరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు. జిల్లాలో 1529 పోలింగు కేంద్రాలున్నాయని, 12,89,371 మంది ఓటర్లు వున్నారని, వారిలో 6,27,321 మంది పురుషులు, 6,62,022 మంది మహిళలు, 28 మంది థర్డ్ జండర్ వున్నారని చెప్పారు. పోలింగ్ సిబ్బంది పివోలు 1759 మంది, ఎపిఓలు 1743 మంది, ఓపిఓలు 7036 మంది పాల్గొంటున్నట్లు వెల్లడించారు. 3666 బ్యాలట్ యూనిట్లు, 3666 కమిషనింగ్ యూనిట్లు, 3968 వివిప్యాట్‌లు, 25 టీమ్‌లు, 101 బియూ, 127 సియూ, 139 వివిప్యాట్‌లు రిజర్వుగా ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఎసిసిలో 25 టీమ్‌లు, 55 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 6 వీడియో సర్వేలెన్స్, 54 స్టాటిక్ సర్వైలన్స్, 7వీడియో వీవింగ్ టీమ్‌లు, 7 అక్కౌంటింగ్ టీమ్‌లు, 7 అసిస్టెంట్ ఎక్స్ పెండీచర్ టీమ్‌లు, 157 సెక్టోరల్ అధికారులు, 145 రూట్ అధికారులు పాల్గొంటున్నారని చెప్పారు. 1529 పోలింగ్ కేంద్రాలలో 340 సమస్యాత్మక కేంద్రాలు వుండగా 380 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించడం జరిగిందని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్‌పి కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా బందోబస్తులో కేంద్ర బలగాలు కూడా పాల్గొంటున్నాయని తెలిపారు. రౌడీషీటర్లు, ఇబ్బందులు కలిగించే వారిని గుర్తించి అవసరాన్ని బట్టి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో 144, 30 పోలీస్ యాక్ట్ అమలులో వుందన్నారు. చెక్ పోస్టులను మరింత పటిష్ఠం చేశామని తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమెన అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, చిత్రంలో ఎస్‌పి మురళీకృష్ణ

ఎన్నికల ఫిర్యాదుల కోసం ఫోన్ నెంబర్లు

అనకాపల్లి : ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబరు 1950, ల్యాండ్ లైన్ నెంబర్ 08924 226 599లకు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి పి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్.గంగాధర్ శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని సంపతిపురం, తమ్మయ్యపేట, సత్తెమ్మ కాలనీ గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలతో సమావేశయ్యారు. ఈ సందర్భంగా పరమటమ్మ లోవ ప్రాంతంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కాంగ్రెస్ తీసుకొచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలకు రోజువారి వేతనం రూ.400 వరకు పెంచడం జరుగుతుందన్నారు. గత మూడు దశాబ్దాలుగా పట్టణ కేంద్రంలోనే ఉంటూ బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ, న్యాయవాదిగా అనేక మందికి ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ హస్తం గుర్తుకి ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దళిత బహుజన సమన్వయ కమిటీ కన్వీనర్ ఎగ్గాడ భాస్కర్ మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ కూలీలకు, బడుగు బలహీన వర్గాలకు, గంగాధర్ సేవలు మరింత అవసరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్, ఇరుగుల దుర్గాప్రసాద్, గాదం దివాకర్, రమణమ్మ పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న గంగాధర్

ఎంఎస్ఎంఇ పాలిసెట్‌లో 'ప్రతిభ' విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి- సబ్బవరం

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎంఎస్ఎంఈ పాలిసెట్‌లో స్థానిక ప్రతిభ విద్యాలయం విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. ర్యాంకులు పొందిన వారిలో కేతకీలత ఆదిరెడ్డి (3వ ర్యాంకు), భార్గవి బలిరెడ్డి (4వ ర్యాంకు), తేజస్వి పెదిరెడ్ల (9వ ర్యాంకు), వెంకటేష్ సారిపల్లి (10వ ర్యాంకు), హేమని కొటాన (15వ ర్యాంకు), జాహ్నవి విన్నకోట (22వ ర్యాంకు), భోగేంద్ర ఆదిరెడ్డి (30వ ర్యాంకు), మణికంఠ జెట్టి (41వ ర్యాంకు), బాలాజీ గొంతిన (44వ ర్యాంకు), అవినాష్ కడియాల (48వ ర్యాంకు) సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు ఏపీ పాలిసెట్‌లో కూడా స్టేట్ 327 ర్యాంకును ప్రణవ్ కొత్తూరు సాధించినట్లు పేర్కొన్నారు. వెయ్యిలోపు ర్యాంకులు ముగ్గురు విద్యార్థులు, 2000 లోపు ర్యాంకులు ఎనిమిది మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.






కేతకీలత (3వ ర్యాంకు), భార్గవి (4వ ర్యాంకు), తేజస్వి (9వ ర్యాంకు), వెంకటేష్ (10వ ర్యాంకు)